విలేఖరులు కావలెను
ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..
స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక
TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :87 నల్గొండ శుక్రవారం 20-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-

## ప్రభాకర్‌రావు అరెస్ట్? సిట్ సుప్రీం నిర్ణయం..



హైదరాబాద్,నాలుగు సార్లు పిలిచారు. గంటల తరబడి సుదీర్ఘంగా విచారించారు. ఫోన్ ట్యాపింగ్ ఎలా చేశారు? ఎందుకు చేశారు? ఎవరు చెబితే చేశారు? ఎవరి అనుమతి తీసుకున్నారు? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేశారు? ఇలా రకరకాల ప్రశ్నలు అడిగారు. సిట్ ఎంతగా గుచ్చిగుచ్చి ఎంక్వైరీ చేస్తున్నా.. %బా×దీ% మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మాత్రం గమ్మునుంటున్నారట. తెలీదు.. గుర్తులేదు.. కాదు.. అవును.. ఇలా పొడిపొడి మాటలే మాట్లాడుతున్నారట. ఇక, ఇలా అయితే లాభం లేదని అనుకుంటున్న సిట్.. ప్రభాకర్‌రావును కస్టడీకి తీసుకోవాలని భావిస్తోంది. అరెస్ట్ దిశగా అడుగులు వేస్తోంది.

సుప్రీంకోర్టుకు సిట్?

ప్రభాకర్‌రావును అరెస్ట్ చేయవద్దంటూ సుప్రీంకోర్టు రక్షణ ఉంది. ఆ కండిషన్ మేరకే ప్రభాకర్‌రావును అమెరికా నుంచి ఇండియాకు రప్పించింది కోర్టు. అందుకే ఇప్పటి వరకూ జరిగిన విచారణలో కింగ్ పిన్ సహకరించట్లేదనే కారణంతో ఆయన్ను అరెస్ట్ చేసేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా సుప్రీంకోర్టును సిట్ ఆశ్రయించనున్నట్టు సమాచాచరం. అంతేకాదు కస్టోడియల్ విచారణ కోసం నాంపల్లి కోర్టులోనూ పిటిషన్ వేసే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే.. ప్రభాకర్‌రావును అరెస్ట్ చేస్తే.. కస్టడీకి తీసుకుంటే.. ఇక నిజాలు రాబట్టడం మరింత ఈజీ అవుతుంది. అప్పుడిక ఆనాటి సీఎం కేసీఆర్ మెడకు ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు బిగుసుకునే అవకాశం ఎక్కువగా ఉందంటున్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకే ప్రభాకర్‌రావు అండ్ టీమ్.. వందలాది మంది ఫోన్లు ట్యాప్ చేశారని చెబుతున్నారు.

ప్రభాకర్‌రావు వాళ్లను ఇరికిస్తున్నారా?

ఇక, విచారణలో ప్రభాకర్‌రావు తన అనుభవమంతా యూజ్ చేసి చాకచక్యంగా సమాధానాలు చెబుతున్నట్టు తెలుస్తోంది. తాను ఏం చేసింది తన పైఅధికారులకు తెలుసంటూ ఈ కేసులో మరింత మందిని ఇన్వాల్వ్ చేసే ప్రయత్నం చేశారు. రివ్యూ కమిటీ పర్మిషన్ తీసుకునే తాను ఫోన్లు ట్యాప్ చేయించానని చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో ఆనాటి రివ్యూ కమిటీ సభ్యులను కూడా సిట్ విచారించింది. రివ్యూ కమిటీ సభ్యులైన ఆనాటి హోంశాఖ మాజీ సెక్రటరీ, ప్రస్తుత డీజీపీ జితేందర్‌తో పాటు మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్‌ను ప్రశ్నించి వివరాలు సేకరించింది.

విచారణకు ఆ ఐపీఎస్‌లు..

ఫోన్ ట్యాపింగ్ కోసం టెలికాం సర్వీసులకి పంపిన నెంబర్లపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభాకర్ రావు టీమ్ అప్పట్లో మావోయిస్టుల సానుభూతిపరులు అంటూ కొన్ని ఫోన్ నెంబర్లను ట్యాపింగ్‌కు సిఫారసు చేసినట్టు సమాచారం. వాటికి అనుమతులు ఎలా ఇచ్చారు? డీజీపీ జితేందర్, అనిల్ ఇచ్చిన వివరాల మేరకు ఆ స్టేట్‌మెంట్‌లను ధృవీకరించేందుకు గురువారం నాటి ప్రభాకర్‌రావు విచారణ కీలకంగా మారింది. త్వరలో మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, మాజీ సీఎస్ సోమేష్ కుమార్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేయనున్నట్టు తెలుస్తోంది.

మావోయిస్టుల పేర్లు చెప్పి..

మావోయిస్టులకు మద్దతు, నిధులు సమకూరుస్తున్నారనే ఏకైక కారణంతో ఇష్టారీతిన ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు విచారణలో వెలుగు చూస్తోంది. ఎన్నికలకు ముందు నెల రోజులు.. ఏకంగా 600 మంది ఫోన్ కాల్స్ చాటుగా విన్నారని తేలింది. అందులో ఆనాటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నుంచి ఎన్నికల సర్వేలు చేసే సైదులు వరకు అనేకమంది పేర్లు, ఫోన్ నెంబర్లు ఉన్నాయని తెలుస్తోంది.

ప్రభాకర్‌రావు అరెస్ట్ తప్పదా?

బుధవారం 8 గంటల పాటు మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును ప్రశ్నించింది. ఆయన ఇచ్చిన సమాచారం, ఇప్పటి వరకూ వివిధ సాక్షులు చెప్పిన వివరాల ఆధారంగా ప్రభాకర్‌రావును గురువారం మరోసారి ప్రశ్నిస్తోంది. ఈ ఎంక్వైరీ అత్యంత కీలకమని తెలుస్తోంది. ఇప్పటి వరకూ జరిగిన విచారణ వివరాలను సుప్రీంకోర్టు ముందు ఉంచి.. ప్రభాకర్‌రావు కీలక నిందితుడని చెప్పి.. ఎంక్వైరీకి సహకరించట్లేదు కాబట్టి ఆయన్ను అరెస్ట్ చేసేందుకు అనుమతి కోరేందుకు సిట్ సిద్ధమవుతోంది.

## తెలంగాణలో ప్రాజెక్టులు కట్టాలా వద్దా?..



హైదరాబాద్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ సందర్భంగా కేబినెట్ లో ఆమోదం లేకుండా ఏమి జరగదు.. ఆయన మంత్రి వర్గంలో ఉన్నవారే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు, వారిని అడగవచ్చు అని సూచించారు.కేసీఆర్ మొదలు పెట్టిన ప్రాజెక్ట్ అని నేను చెప్పాను, అది ఎప్పుడు మొదలయ్యిందో తెలుసుకోవాలి అని పేర్కొన్నారు. సుందిళ్ళ, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులు రీ డిజైన్ లో కేసీఆర్ చేర్చారు.. అవినీతి జరిగితే విచారణ జరపండి, విచారణ జరిగిన చర్యలు తీసుకుంటారాని నమ్మకం లేదు, అందుకే సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులు రాజకీయ పార్టీలకు ఏటిఎంలుగా మారాయని ఎంపీ ఈటల తెలిపారు.అయితే, మొదట పిల్లర్లు రిపేర్ చేసి నీళ్లు ఇచ్చే పని పెట్టుకోండి అని రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ప్రాజెక్టులు కట్టడం తప్పు కాదు, వాటి పేరుతో అక్రమాలు చేయడం తప్పు అన్నారు. కేబినెట్ ఆమోదం లేకుండా ఇంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందా అని ప్రశ్నించారు. ప్రతి నిర్ణయం కేబినెట్ రాటిఫికేషన్ జరుగుతుంది.. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని డాక్యుమెంట్స్ మీకు పంపిస్తాను అని చెప్పుకొచ్చారు. మీ డిపార్ట్మెంటో ఏ నిర్ణయం తీసుకోవాలి అనుకున్నా.. కేబినెట్ లో పెట్టండి అని కేసీఆర్ చెప్పే వారు ఇది నిజం కాదంటే నేను దేనికైనా సిద్ధం అని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మించడం, అవినీతి వేరువేరుగా చూడాలి.. ప్రాజెక్ట్ నిర్మించాలి కానీ వాటిని అడ్డం పెట్టుకొని సంపాదించడాన్ని మా పార్టీ వ్యతిరేకిస్తుందని బీజేపీ ఎంపీ ఈటల చెప్పారు.ఇక, తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగింది అని ఈటల రాజేందర్ తెలిపారు. నేను జైళ్లకు పోయిన, నా రక్తం చిందిది, పెట్రోల్ మంటల్లో యువత కాలిపోయింది, ఫలితంగా వచ్చిన తెలంగాణలో ప్రాజెక్ట్ కట్టాలా వద్దా? అని ప్రశ్నించారు. అనేక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే మొదలు పెట్టారు కానీ పూర్తిచేయలేదు.. జలయజ్ఞంలో భాగంగా ప్రాణహిత- చేవెళ్ల ఐదేళ్లలో పూర్తి చేసే ప్రాజెక్టేనా కదా?.. ఎందుకు పూర్తి చేయలేదన్నారు. కమీషన్ త్వరగా పూర్తి చేయాలి అవినీతి నిగ్గు తేల్చాలి.. బీజేపీ అయితే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తుంది.. బీజేపీ ప్రాజెక్ట్స్ కట్టడానికి వ్యతిరేకం కాదు.. అధికారం అడ్డం పెట్టుకొని టెండర్లు లేకుండా పనులు పంచుకోవడం తప్పు అని ఎంపీ ఈటల పేర్కొన్నారు.

## పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు...



మునుగోడు, జూన్ 19 : అర్హులైన ప్రతి పేదవానికి పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మునుగోడు మండలం పలివెల గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్లతో పాటు, డ్రైనేజీలు చేపట్టాల్సిన ప్రాంతాలను, ఇళ్లపై నుండి వెళ్తున్న విద్యుత్ తీగలను పరిశీలించారు. పలివెల నుండి ఊకొండి వెళ్లే రహదారిని, పలివెల నుండి చీకటిమామిడి వెళ్లే రహదారిని పరిశీలించారు.గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఫర్నిచర్, లైట్లు, ఫ్యాన్లు అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఫర్నిచర్ ఇప్పించే బాధ్యత తనదన్నారు. కాగా సామాజిక బాధ్యతతో లైట్లు, ఫ్యాన్లు ఉపాధ్యాయులే సమకూర్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకుంటున్న విద్యార్థులకు తమ తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద ప్రోత్సహించి మెమెంటోలు అందజేస్తామని తెలిపారు.అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత తనదన్నారు. పలివెల గ్రామంలో డ్రైనేజీ సిస్టంను శాస్త్రీయంగా నిర్మించాల్సిన అవసరం ఉందని, దానికోసం ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గృహాల పైన ఉన్న విద్యుత్ తీగలను వెంటనే తొలగించి, గృహాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అలాగే గ్రామంలో కొత్తగా ఎంతమందికి పింఛన్లు రావాలో జాబితాను సిద్ధం చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. పర్యటనలో ఎమ్మెల్యే వెంట ఎంపీడీఓ, ఎంపీఓ, విద్యుత్ ఏఈ, గ్రామ కార్యదర్శి, పలివెల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మునుగోడు మండల ముఖ్య నాయకులు ఉన్నారు.

## జిల్లా కేంద్రాన్ని విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతా

నాగర్ కర్నూల్ రూరల్ : నాగర్ కర్నూల్ జిల్లాను ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచాక 18 నెలల కాలంలోనే కళాశాలను మూడు నాలుగుసార్లు సందర్శించానన్నారు. మొదటిసారి కళాశాలను సందర్శించినప్పుడు కళాశాల భవనం శిథిలావస్థకు చేరి వర్షపు నీరు తరగతి గదులలోకి కురుస్తుందని, కప్పు పెచ్చులు ఊడి విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని స్థానిక ప్రిన్సిపల్ తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. కళాశాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నిధుల మంజూరికి ముఖ్యమంత్రిని కోరడంతో రూ. 9 కోట్లు మంజూరు చేశారని తెలిపారు.కళాశాల భవన నిర్మాణాన్ని అన్ని రకాల సౌకర్యాలతో మంచి డిజైన్ ఉండేలా, జిల్లాలో ఎక్కడ లేని విధంగా చేపడతామన్నారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు అయిందని, ఏ చదువైనా నాగర్ కర్నూల్ జిల్లాలోనే చదువుకొనేలా విద్యా కేంద్రాలు ఏర్పాటు చేపడుతామన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్,




అధ్యాపకులు, విద్యార్థులు ఎమ్మెల్యేను శాలువా, పూల బొకేతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, ప్రిన్సిపాల్ మాధవి , మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, రాజ్ కుమార్, నిజాముద్దీన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో ఇంగ్లీష్ మాట్లాడే వారు త్వరలోనే సిగ్గుపడతారు..



న్యూఢిల్లీ, భారతీయ భాషలు దేశ గుర్తింపుకు ఆత్మ వంటివని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం అన్నారు. భారతదేశ భాషా వారసత్వాన్ని తిరిగి పొంది, మాతృభాషల పట్ల గర్వంతో ప్రపంచానికి నాయకత్వం వహించాల్సిన సమయం వచ్చిందన్నారు.మాజీ సివిల్ సర్వెంట్ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రచించిన 'మెయిన్ బూంద్ స్వయం, ఖుద్ సాగర్ హూన్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతూ అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు.''ఈ దేశంలో, ఇంగ్లీష్ మాట్లాడేవారు త్వరలోనే సిగ్గపడతారు . అటువంటి సమాజం ఏర్పడటం ఎంతో దూరంలో లేదు. దృఢ సంకల్పం ఉన్నవారు మాత్రమే మార్పు తీసుకురాగలరు. మన దేశ భాషలు మన సంస్కృతికి రత్నాలు అని నేను నమ్ముతున్నాను. మన భాషలు లేకుంటే, మనం నిజంగా భారతీయులుగా ఉండటం మానేస్తాము." అని అమిత్ షా అన్నారు."మన దేశాన్ని, మన సంస్కృతిని, మన చరిత్రను, మన మతాన్ని అర్థం చేసుకోవడానికి, ఏ విదేశీ భాష కూడా సరిపోదు. పూర్తి భారతదేశ ఆలోచనను విదేశీ భాషల ద్వారా ఊహించలేము. ఈ యుద్ధం ఎంత కష్టమో నాకు పూర్తిగా తెలుసు, కానీ భారత సమాజం దానిని గెలుస్తుందని కూడా నాకు పూర్తిగా నమ్మకం ఉంది. మరోసారి, ఆత్మగౌరవంతో, మన దేశాన్ని మన స్వంత భాషలలో నడుపుతాము, ప్రపంచాన్ని కూడా నడిపిస్తాము" అని అన్నారు."ప్రధాని మోడీ అమృత కాలం కోసం 'పంచ్ ప్రాణ్' (ఐదు ప్రతిజ్ఞలు) కు పునాది వేశారు. అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క లక్ష్యాన్ని సాధించడం, బానిసత్వం యొక్క ప్రతి జాడను వదిలించుకోవడం, మన వారసత్వం పట్ల గర్వపడటం, ఐక్యత మరియు సంఘీభావానికి కట్టుబడి ఉండటం, ప్రతి పౌరుడిలో విధి స్ఫూర్తిని రగిలించడం ఈ ఐదు ప్రతిజ్ఞలు 130 కోట్ల మంది ప్రజల సంకల్పంగా మారాయి. అందుకే 2047 నాటికి మనం శిఖరాగ్రంలో ఉంటాం, ఈ ప్రయాణంలో మన భాషలు ప్రధాన పాత్ర పోషిస్తాయి" అని చెప్పారు.మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన పుస్తకం గురించి మాట్లాడుతూ.. పరిపాలన అధికారుల శిక్షణలో మార్పు అవసరమని కేంద్ర హోం మంత్రి చెప్పారు. ఏదైనా పాలకుడు లేదా నిర్వాహకుడు సానుభూతి లేకుండా పాలిస్తే, వారు పాలన యొక్క నిజమైన లక్ష్యాన్ని సాధించలేరని అన్నారు. మన దేశం కటిక చీకటిలో ఉన్నప్పుడు కూడా మన సాహిత్యం, మన మతం, స్వేచ్ఛ, సంస్కృతి దీపాలను వెలిగించిందని అన్నారు. సాహిత్య మన సమాజానికి ఆత్మ అని కేంద్ర హోంమంత్రి చెప్పారు.

## దుర్గం చెరువులో దూకి యువతి ఆత్మహత్య



హైదరాబాద్,జూన్19: నగరంలోని మాదాపూర్ దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్యకు పాల్పడింది. మృతిచెందిన యువతిని సుష్మ(27)గా గుర్తించారు. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ అడ్డగుట్టలో సుష్మ నివాసముంటోంది. బుధవారం హైటెక్ సిటీలోని ఆఫీస్‌కి పని నిమిత్తం ఆమె వెళ్లింది. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆఫీస్ మేనేజర్‌కు తండ్రి అంజయ్య కాల్ చేశారు. రాత్రి 10.30 గంటలకే ఆమె బయల్దేరినట్లు మేనేజర్ తెలిపారు. ఈ క్రమంలో హైదరాబాద్ మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువులో ఓ యువతి మృతదేహం లభ్యమైంది. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. పోలీసులు ప్రాథమికంగా ఇది ఆత్మహత్యగా అనుమానిస్తున్నారు. బాధితురాలిని సుష్మ (27)గా గుర్తించారు. ఈ రోజు తెల్లవారుఝామున 4 గంటలకు బొట్టు అంజయ్య అనే వ్యక్తి మిస్సింగ్ కంప్లైంట్‌ను మాదాపూర్ పోలీసులకు ఇచ్చారు. 'ఆఫీస్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సుష్మ తిరిగి రాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఉదయం 7 గంటలకు దుర్గం చెరువు వద్ద ఒక మృతదేహం కనిపించిందని సమాచారం అందింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. అది మిస్సింగ్ అయిన సుష్మదిగా గుర్తించారు. సుష్మ ఈ ఏడాది జనవరి 31న అమృత్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను వివాహం చేసుకుంది. అమృత్ కూడా ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. సుష్మ తల్లిదండ్రుల ప్రకారం.. పెళ్లి సమయంలో 6 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు, బైక్‌ను కట్నంగా ఇచ్చారు. అయినప్పటికీ సుష్మ అత్త, మామలు అదనపు కట్నం కోసం వేధించారని, ఇటీవల ఆమె శారీరకంగా, మానసికంగా తీవ్రంగా బాధపడుతోందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కొద్దీ రోజులుగా ఆరోగ్యం బాగాలేదని, నేరెడ్‌మేట్‌లోని ఓ హాస్పిటల్‌లో సుష్మను రెండు రోజుల క్రితం వైద్యులకు చూపించినట్లు తల్లిదండ్రులు వెల్లడించారు. అయితే.. బుధవారం ఆమె తిరిగి ఆఫీస్‌కు వెళుతున్నానంటూ ఇంటి నుంచి వెళ్లిపోయింది. కానీ తిరిగి రాలేదని వారు తెలిపారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో, సుష్మ తన అత్తింటి వారు, భర్త నుంచి ఎదుర్కొంటున్న అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని అనుమానిస్తున్నారు. మాదాపూర్ సీఐ కృష్ణ మోహన్ మీడియాతో మాట్లాడుతూ, 'కేసు నమోదు చేశాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విచారణ కొనసాగుతోంది' అని తెలిపారు. కుమార్తె కనిపించడం లేదంటూ ఉదయం 4 గంటలకు మాదాపూర్ పీఎస్‌లో అంజయ్య ఫిర్యాదు చేశారు. దుర్గంచెరువులో మృతదేహం తేలియాడుతోందని గురువారం ఉదయం 7 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతదేహం సుష్మదిగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఏకశిలానగర్ లేఅవుట్‌ను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్,మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కొర్రెముల రెవెన్యూ పరిధిలోని ఏకశిలానగర్ లేఅవుట్‌ను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. పైసా పైసా జమచేసి పిల్లల భవిష్యత్ కోసం ఇంటి స్థలాలు కొనుగోలు చేస్తే.. స్థిరాస్తి వ్యాపారి వెంకటేశ్ అనే వ్యక్తి కబ్జాలకు పాల్పడుతున్నారంటూ పలువురు కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు.

## ఇరాన్,పాలస్తీనా ప్రజలపై దాడులను ఖండించాలి : వామపక్ష పార్టీలు



వరంగల్ : ఇరాన్, పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దురహంకార దాడులను ఖండించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ గ్రేటర్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. ఇరాన్ దేశంపై అమెరికా సామ్రాజ్యవాద దత్తపుత్రుడు ఇజ్రాయిల్ చేస్తున్న దురహంకార దాడులకు వ్యతిరేకంగా రాష్ట్ర వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ధర్నా చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇజ్రాయిల్ ఇరాన్ దేశంపై వైమానిక క్షిపణి దాడులతో ప్రభుత్వ అధికారులను, ప్రజలను, శాస్త్రవేత్తలను చంపుతుందన్నారు. అమెరికా సామ్రాజ్యవాది ట్రంప్ కనుసన్నలలోనే జరుగుతుందన్నారు. 55,000 మందికి పైగా పాలస్తీనా ప్రజలను హత్య చేసిందని, వారు చేస్తున్న పోరాటం న్యాయమైందన్నారు. ప్రపంచ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఈ దేశాలు పశ్చిమ ఆసియాలోని అరబ్బు దేశాలపై ఆధిపత్యం కోసమే యుద్ధాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయు జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, సీపీఎం నాయకులు వల్లందాస్ దుర్గయ్య, సీపీఐ ఎంఎల్ లిబరేషన్

# పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు

న్యూఢిల్లీ, ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రతరమవుతుండటంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్ని తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ సింధు' అని నామకరణం చేసినట్లు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తున్న వేళ.. ఉత్తర ఇరాన్ నుంచి జూన్ 17న ఆర్మేనియాకు చేరుకున్న 110 మంది విద్యార్థులను భారత్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేసింది. వీరంతా ఆర్మేనియా రాజధాని యెరవాన్ నుంచి ప్రత్యేక విమానంలో భారత్‌కు బయల్దేరారు. జూన్ 19న తెల్లవారు జామున న్యూఢిల్లీకి చేరుకోనున్నారు. విదేశాల్లో ఉన్న తన పౌరుల భద్రతకు భారత్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని కేంద్ర విదేశాంగ శాఖ అధికారి ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్ నగరం దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో అక్కడి భారత ఎంబసీ ఇప్పటికే ప్రత్యేక అడ్వైజరీని జారీ చేసింది. తక్షణమే ఆ నగరాన్ని వీడాలని కోరింది. టెహ్రాన్ వెలుపల సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని భారతీయులకు సూచించింది. ఇప్పటివరకు భారత ఎంబసీని సంప్రదించని భారతీయులు వెంటనే దౌత్యాధికారులతో కాంటాక్ట్ అవ్వాలని కోరిన విషయం తెలిసిందే. ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో ఆ రెండు దేశాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంటున్న తెలంగాణవాసులకు సాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం దిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ప్రారంభించింది. ఇప్పటివరకూ రాష్ట్ర వాసులు ఎవరూ ప్రభావితం అయినట్లు సమాచారం లేకపోయినా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ముందుజాగ్రత్తగా ఈ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తాము ఉంటున్న దేశాల్లో గానీ, ప్రయాణాల్లో గానీ ఇబ్బంది పడుతున్న తెలంగాణ వాసులు కింద పేర్కొన్న నంబర్లను సంప్రదించవచ్చని తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. వందన- రెసిడెంట్ కమిషనర్ పీఎస్- 91 9871999044, జి.రక్షిత్‌నాయక్, లైజన్ ఆఫీసర్- ?91 9643723157, జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్- ?91 9910014749, సీహెచ్ చక్రవర్తి, పౌరసంబంధాల అధికారి- ?91 9949351270.

# స్థానిక ఎన్నికలపై ఫీవర్..

నిజామాబాద్, బీసీ గణనకు సంబంధించి కమిషన్ల రిపోర్టులు ఆధారంగానే రిజర్వేషన్లు పెంచి లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. బహుశా జూలైలో స్థానిక ఎన్నికలు జరిగే ఛాన్స్ ఉందంటూ వార్తలు వస్తున్నాయి. 42శాతం బిసి రిజర్వేషన్లు ప్రకటించాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇవిప్రకటించి చిత్తుశుద్ధి చాటుకోవాలని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్లు ప్రకటించకుండా స్థానిక ఎన్నికలకు వెళితే ఊరుకోమని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. ఇకపోతే ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బిఆర్ఎస్ భావిస్తోంది. స్థానిక ఎన్నికల్లో ఫుట్‌బాల్ ఆడుతామని కెటిఆర్ ప్రకటించారు. తుది ఓటర్ల జాబితాను అధికారులు ఇటీవల ప్రకటించారు. తాజాగా జిల్లాలో 14,35,214 మంది ఓటర్లుండగా పురుషులకన్నా 80,875 మంది మహిళా ఓటర్లు ఎక్కువ ఉన్నట్టు లెక్క తేలింది. మహిళల తర్వాత యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారు 26 వేల వరకు ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువతీయువకులే దాదాపు సగం వరకు ఉన్నారు. కొత్త జాబితా ప్రకారం 18 నుంచి 39 ఏండ్ల మధ్య వయస్సున్న ఓటర్ల సంఖ్య 6, 96,014. దీంతో రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో మహిళలు, యువతే కీలకం కానున్నారు. దీంతో యువతలో కూడా సర్పంచ్ పదవులపై ఆశ కనిపిస్తోంది. పంచాయితీలతో పాటు వాటి పరిధిలోని 5,022 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్స్ లతో పాటు పేపర్ బ్యాలెట్ రెడీ చేశారు. జిల్లాలో 31 మండలాలున్నాయి. పంచాయతీ ఎన్నికల తర్వాత ఈ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటి లోనూ యువత, మహిళలే నిర్ణేతలు కానున్నారు. వారు ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లే అందలమెక్కే చాన్స్‌ఉందని అంటున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలోనే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. జులైలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూడా మాజీలయ్యారు.మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్ల టర్మ్ పూర్తికానుంది. దీంతో రూరల్, అర్బన్ లోకల్ బాడీలకు వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా 15 గ్రామ పంచాయ తీలు ఏర్పడడంతో జిల్లాలో పంచాయితీల సంఖ్య 545 పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలో అప్పుడే స్థానిక హడావిడి మొదలయ్యింది. ముఖ్యంగా పంచాయితీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారంతా ఇప్పటి నుంచే గ్రామాల్లో కరచాలనాలు మొదలు పెట్టారు. పలకరింపులు చేస్తున్నారు. బాగున్నావా అని ఆత్మీయంగా చూస్తున్నారు. పెళ్లిళు , పేరంటాల సందర్భంగా గ్రామాల్లో ఇదే సందడి కనిపించింది. వాడు సర్పంచ్‌కు పోటీ చేస్తున్నాడనే కామెంట్స్ కూడా బాగానే వినిపించాయి. ఇకపోతే జిల్లాలో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు బాన్సువాడ సెగ్మెంట్‌లోని కొన్ని మండలాలున్నాయి.

# ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త విషయాలు

హైదరాబాద్,ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కొన్ని పార్టీలు లేదా వ్యక్తులు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారన్న నెపంతో, పలువురు కీలక రాజకీయ నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు వెల్లడవుతోంది. తాజాగా ఈ కేసులో 4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుపై ఆరోపణలు వచ్చాయి. 2023 నవంబర్ 15 నుండి 30వ తేదీ మధ్యలోనే కనీసం 618 మంది నేతల ఫోన్లను ట్యాప్ చేశారట. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ నాయకులు కూడా ఉన్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి, కోటింరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి వంటి నాయకుల ఫోన్లను కూడా ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం ట్యాప్ చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ సహా అనేక పార్టీల కీలక నేతలు, అనుచరుల ఫోన్లు కూడా ట్యాపింగ్ లక్ష్యంగా మారాయి. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేగంగా దర్యాప్తు కొనసాగిస్తోంది. నిన్న ఒక్కరోజే తొమ్మిది మంది సాక్షుల స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. అందులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, గద్వాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఆమె భర్త తిరుపతయ్య, గాంధీ భవన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులు ఉన్నారు. ఇవన్నీ మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చిన ఆధారాలతో వెలుగులోకి వచ్చాయి. ఈ రోజు పీసీసీ అధికార ప్రతినిధి జయపాల్ రెడ్డి సిట్ ముందు హాజరై స్టేట్‌మెంట్ ఇచ్చారు. అదే విధంగా ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును కూడా విచారించారు.

# భారత్‌కు పశ్చిమాసియా సెగ

న్యూఢిల్లీ,ఉరుము ఉరిమి మంగలంమీద పడిన చందంగా ఇరాన్ –ఇజ్రాయెల) మధ్య రగిలిన యుద్ధజ్వాలల ప్రభావం పరోక్షంగా భారత్‌పై పడే సూచనలు అధికంగా కనిపిస్తున్నాయి. ఇరాన్- ఒమన్ దేశాలను విభజిస్తూ, పర్షియన్ గల్ఫ్‌కు దారితీసే కీలకమైన హర్మూజ్ జలసంధికి యుద్ధం విస్తరించినట్లు తాజాగా ఆ ప్రాంతంలో మూడు నౌకలు దగ్ధమవడాన్ని బట్టి తెలుస్తోంది. అదే నిజమైతే, భారత్ సహా అనేక దేశాలు చమురు సంక్షోభంలో చిక్కుకుని విలవిల్లాడే పరిస్థితి ఎంతో దూరంలో లేదు. అత్యంత ఇరుకైన హర్మూజ్ జలసంధి ద్వారానే పశ్చిమాసియా దేశాలనుంచి ప్రపంచానికి రోజూ కోట్లాది పీపాల చమురు రవాణా అవుతూ ఉంటుంది.పశ్చిమాసియా దేశాలనుంచి భారత్ దిగుమతి చేసుకునే చమురులో 40 శాతం ఈ మార్గం ద్వారానే వస్తుంది. యుద్ధ సమయంలో ఈ మార్గం గుండా వెళ్తున్న చమురు ఓడలపై దాడులు చేసి, వైరిపక్షాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించడం కద్దు. నాలుగు దశాబ్దాల కిందట ఇరాన్ ఇరాక్ మధ్య యుద్ధం మొదలైనప్పుడు హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే చమురు ఓడలపై పరసర్పం దాడులు జరుపుకోవడంతో ప్రపంచ దేశాలు చమురు సంక్షోభంలో చిక్కుకున్న విషయం విస్మరించరాని అంశం. ఇరాన్ ఒమన్ దేశాలను విడదీసే హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌దే ఆధిపత్యం. యుద్ధం ముదిరితే ఈ జలసంధిని ఇరాన్ మూసివేసే ప్రమాదం ఉంది. అలాగే ఇరాన్ నుంచి చమురును రవాణా చేసే ఓడలపై ఇజ్రాయెల్ దాడులు చేయనూవచ్చు. దీంతో చమురు అందక అనేక దేశాలు అల్లాడిపోవడం తథ్యం.భారత్‌కు సైతం ఒకప్పుడు ఇరానే అతి పెద్ద చమురు ఎగుమతిదారు. 2019లో అమెరికా ఆంక్షలు విధించడంతో ఇరాన్ నుంచి చమురు దిగుమతులు తగ్గించుకుని, రష్యా, ఇరాక్, సౌదీ అరేబియాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. హర్మూజ్ జలసంధిలో దాడులు పెరిగితే చమురు రవాణా స్తంభించిపోయి, ధరలు ఆకాశాన్నంటితే ఆ పరిణామం భారత్‌కూ ప్రమాద హేతువే. మరోవైపు దౌత్యపరంగానూ భారత్ చిక్కుల్లో పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలతో భారత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. రెండింటిలో ఏదో ఒక దేశాన్ని ఎంచుకోమంటే అది భారత్‌కు ఆత్మహత్యాసదృశమే అవుతుంది. అందుకే ఎప్పటిలాగే తటస్థ వైఖరిని అవలంబిస్తోంది. ఇటీవల షాంఘై సహకార సంస్థ ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిని నిర్ద్వంద్వంగా ఖండించగా, భారత్ మాత్రం దౌత్యపరమైన మార్గాల ద్వారా యుద్ధానికి పరిష్కారం కనుగొనాలంటూ మధ్యేమార్గాన్ని అనుసరించింది.షాంఘై సహకార సంస్థలో ఇరాన్, భారత్ రెండూ సభ్యదేశాలే అయినప్పటికీ భారత్ గోడమీది పిల్లివాటాన్ని ప్రదర్శించడం అనేక విమర్శలకు దారితీసింది. బ్రెజిల్‌లో వచ్చే నెలలో జరగనున్న బ్రిక్స్ సదస్సు కూడా భారత్‌కు సంకటంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. బ్రిక్స్ దేశాల కూటమిలో ఇరాన్‌కు కూడా సభ్యత్వం ఉండటంతో భారత్ పరిస్థితి ముందు నుయ్యి వెనక గొయ్యి చందంగా మారబోతోంది. ఇరాన్‌ను సమర్ధించడం ద్వారా ఇజ్రాయెల్‌తో విభేదిస్తే అమెరికాతో కోరి కయ్యం తెచ్చుకున్నట్లే అవుతుంది. ఇక, ఇరాన్‌లో భారత్ ఇప్పటికే చేపట్టిన చాబహార్ ఓడరేవు నిర్వహణపై కూడా యుద్ధ మేఘాలు కమ్ముకున్నట్లే కనిపిస్తోంది. ఈ ఓడ రేవు కోసం భారత్ ఇప్పటికే కోట్లాది డాలర్లు ఖర్చు చేసింది.ఇజ్రాయెల్ దాడుల్లో ఓడరేవు దెబ్బతింటే, అది భారత్‌కు తీరని నష్టం కలిగిస్తుంది. మరోవైపు ఇరాన్‌లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులను క్షేమంగా స్వదేశానికి తీసుకురావలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. యుద్ధ నేపథ్యంలో ఇరాన్ గగనతలాన్ని మూసివేయడంతో టెహ్రాన్ నుంచి భూమార్గం ద్వారానే విద్యార్థుల్ని తీసుకురావలసి ఉంటుంది. ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధానికి చరమగీతం పాడేందుకు అగ్రదేశాలు చేయీచేయీ కలపకపోతే చమురు సంక్షోభం ప్రపంచాన్ని కుదిపివేయడం తథ్యం.ఇప్పటికే చమురు ధరలు



అంతకంతకూ ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో, యుద్ధం మరింత ముదిరితే ద్రవ్యోల్బణం పెచ్చుమీరి, అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలం కావచ్చు. అయితే, అణు ఒప్పందంపై ఇరాన్ సంతకం చేస్తే తప్ప ఈ యుద్ధం ఆగేది కాదని అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ మొండికేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ తోనూ, ఇజ్రాయెల్ తోనూ స్నేహ సంబంధాలు గల భారత్ మధ్యవర్తిత్వానికి నడుం బిగించాలి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను నివారించే సామర్థ్యం భారత ప్రధానికి ఉందంటూ భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం.

# ఫాస్టాగ్ పాస్‌ల ఆలోచన భేష్

అమరావతి,ఫాస్టాగ్ పాస్‌ల ఆలోచనను ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ స్వాగతించారు. ఇదో మంచి ముందడుగని అన్నారు. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ఉపశమనం కలిగించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. భారత రహదారి మౌలిక సదుపాయాల ప్రస్థానంలో దీన్నో గేమ్ ఛేంజర్‌గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ నిర్ణయంతో ఫాస్టాగ్ వార్షిక పాస్ తీసుకురావాలన్న ప్రయాణికుల దీర్ఘకాలిక డిమాండ్‌కు పరిష్కారం లభించినట్లవుతుందని పేర్కొన్నారు. టోల్ చెల్లింపులను సరళీకృతం చేస్తూ.. ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఉపశమనం కలిగించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను అమలులోకి తీసుకొస్తున్నందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రూ.3వేల వార్షిక పాస్‌తో వాహనదారులకు ఆర్థిక ఉపశమనం కలగడం మాత్రమే కాదు.. దేశ వ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, వివాద రహిత హైవే ప్రయాణం సాకారమవుతుందన్నారు. దీని ద్వారా టోల్ ఎ÷–లాజాల సమీపంలో నివసిస్తూ రెగ్యులర్‌గా ప్రయాణించే వారికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. వారికి సమయంతో పాటు భారం కూడా తగ్గుతుంద న్నారు. ఈ నిర్ణయం నితిన్ గడ్కరీకి మోదీ సారథ్యంలోని ప్రజా పాలన పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.3 వేలు చెల్లించి ఈ పాస్ తీసుకోవాల్సి ఉంటుందని ఆయన 'ఎక్స్'లో చేసిన పోస్టును పవన్ రీట్వీట్ చేస్తూ పైవిధంగా స్పందించారు. అయితే కార్లు, జీపులు, వ్యాన్లు వంటి నాన్- కమర్షియల్ వాహనాలకు వర్తించేలా కేంద్రం ప్రకటించిన ఈ పాస్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. పలు నిబంధనలు ఉండే అవకాశముంది.

# వరుసగా కేంద్రమంత్రులతో భేటీ

న్యూఢిల్లీ, ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 'రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అక్కడి ప్రజల చిరకాల కోరికని అన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించండి. న్యాయపరమైన అవసరాల కోసం రాయలసీమ ప్రజలు ఏపీ రాజధానికి రావడానికి 500 కి.మీ పైగా ప్రయాణించాల్సి ఉంటుంది. యువగళం పాదయాత్ర సందర్భంగా సీమ ప్రజలు, న్యాయవాదులు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా త్వరితగతిన బెంచ్ ఏర్పాటుకు సహకరించాలి. రాష్ట్రంలోని కోర్టుల్లో జ్యుడిషియరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి సహకారం అందించండని కేంద్రమంత్రిని కోరారు. యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని లోకేశ్ కేంద్రమంత్రికి అందజేశారు. ఇకపోతే కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిశారు.. పండ్లతోటల అభివృద్ధికి అన్నివిధాల అనుకూలమైన వాతావరణం కలిగిన రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని చిరాగ్ పాశ్వాన్ కు మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తో మంత్రి లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ? రాయలసీమలో రైతులు మామిడి, అరటి, టమోటా, బత్తాయి, దానిమ్మ, డేట్స్ వంటి పండ్లతోటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.. యువగళం పాదయాత్ర సందర్భంగా వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశాను అన్నారు నారా లోకేష్? ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా అక్కడి రైతులకు మెరుగైన రేట్లు లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉంది. రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు సహకరించాలకు లోకేష్ కోరారు. దీనికి కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ స్పందిస్తూ? ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం అందిస్తాం. తిరుపతి ట్రిపుల్ ఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి నేను ఏపీకి వస్తున్నాను. జులై 11, 12 తేదీల్లో రాయలసీమ పర్యటనకు వస్తున్నా. మీరు కూడా వస్తే క్షేత్ర స్థాయిలో పర్యటించి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై అధ్యయనం చేద్దాం. అన్నదాతలకు మేలు చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని చెప్పారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని ఈ సందర్భంగా చిరాగ్ పాశ్వాన్ కు మంత్రి నారా లోకేష్ అందించారు..

# గోదావరి- బనకచర్లను వ్యతిరేకిస్తూ కేంద్రాని తీర్మానం

హైదరాబాద్, జగన్‌తో మిలాఖత్ అయిన తరవాతనే ఆనాటి సిఎం కెసిఆర్ గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు 2019 అక్టోబరులో కేసీఆర్, జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించటంపై చర్చించు కున్నారని అన్నారు. . గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే అంకురార్పణ జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. గోదావరి-బనకచర్లపై అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. నీటి ఒప్పందాలపై నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. గోదావరి-బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించాం. అన్ని పార్టీలను కలుపుకొని పోరాడుతాం అని వివరించారు. నిజానికి రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్టు నమస్తే తెలంగాణలో రాశారని సీఎం తెలిపారు. రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు. '2192016న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించింది. ఏటా 3వేల టీఎంసీల నీరు వృథాగా గోదావరి నీరు సముద్రంలో కలుస్తోందని అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ అన్నారు. 3వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయని మొదట మాట్లాడింది కేసీఆరే. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా దస్త్రాల రూపంలో ఉంది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని ఆనాడు తెలంగాణ, ఏపీ మంత్రులు మీడియాకు చెప్పారు. తెలంగాణకు కృష్ణాలో 299 టీఎంసీలు సరిపోతాయని ఆనాడు కేసీఆర్ ఒప్పుకొని సంతకం చేశారు. ఆనాడు కేసీఆర్ చేసిన సంతకం ఇవాళ తెలంగాణకు ప్రతిబంధకంగా మారింది' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం తెలిపారు. ఆనాడు తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ మాట్లాడారని వివరణ ఇచ్చారు. కృష్ణానదిని కలుపుతూ గోదావరి జలాలు తీసుకెళ్తే అభ్యంతరం లేదని కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. సమావేశం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో జరుగుతోందన్నారు.

# 25 లక్ష రివార్డు ప్రకటించిన ప్రభుత్వం

వరంగల్,ఉత్తరాంధ్రలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలిశాలకు చెందిన గాజర్ల రవి మృతి చెందాడు. ఈ ఘటనతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. గాజర్ల రవి మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధు మిత్రులు శోకసంద్రంలో మునిగారు. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ప్రతినిధిగా ఉన్నారు. గాజర్ల రవిపై 25 లక్షల రివార్డు ఉంది. పెత్తందార్ల వ్యవస్థకు వ్యతిరేకంగా తాడిత, పీడిత, బలహీన వర్గాల కోసం పోరుబాట ఎంచుకున్న వారిలో వెలిశాలలోని గాజర్ల కుటుంబం ఒకటి. కుటుంబంలోని అందరు కూడా అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమం వైపు అడుగులు వేశారు. గాజర్ల కుటుంబంలోని నలుగురు సోదరుల్లో ముగ్గురు అజ్ఞాతంలోకి వెళ్లారు. పెద్దవాడైన సమ్మయ్య సింగరేణిలో పనిచేసి పదవీ విరమణ చేసి హన్మకొండలో స్థిరపడ్డారు. ఆయనపై కూడా మావోయిస్ట్ సానుభూతిపరుడిగా ముద్రవేయడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మిగతా ముగ్గురు అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్ళారు.

# వలసలే వర్తమాన వాస్తవం



సెంట్రల్ డెస్క్:ఆకలి నుంచి, అగడ్తల నుంచి, వేధింపుల నుంచి, ఘర్షణల నుంచి, మృత్యువు నుంచి సుదూరంగా వెళ్లిపోవడానికీ, సురక్షితంగా బతకడానికీ సాధారణ ప్రజానీకం చేస్తున్న ప్రయత్నాలు ప్రపంచంలో అంతకంతకూ ఎక్కువవుతున్నాయి. ప్రతి దేశంలోనూ జాతీయవాద ధోరణులు పెరిగి, మెజారిటీ వాదం ముదిరి సరిహద్దులు మూసుకుపోతున్నా బతుకుపోరులో పరాజితులవుతున్న సాధారణ జనం ఎప్పటిలా 'వలస గీతం' పాడుతూనే ఉన్నారు. నిరుడంతా ఒక దేశం నుంచి మరో దేశానికి కోట్లాదిమంది ప్రజానీకం వలసపోయారని లాన్సెట్ నివేదిక ప్రకటించింది. ఒక్క మాటలో%–% ప్రతి ఎనిమిది మందిలో ఒకరు స్వస్థలాలను వదిలిపోతున్నారు. ఒక్కో దేశంలో ఒక్కో సమస్య.నియంత పోకడలతో ఉండే పాలకులు కావొచ్చు... సాయుధ ముఠాల బెదిరింపుల వల్ల కావొచ్చు, కళ్లముందు జరుగుతున్న ఘర్షణలు ముదిరి తమను కూడా కబళిస్తాయన్న భయం కావొచ్చు ఎందరెందరో సురక్షిత ప్రదేశాలను అన్వేషిస్తూ తెలియని తీరాలకు పయనమవుతున్నారు. వీటికి తోడు ఈ 21వ శతాబ్దంలో వాతావరణ మార్పుల కారణంగా వచ్చిపడుతున్న సమస్యలు కూడా వలసలను పెంచుతున్నాయని లాన్సెట్ నివేదిక సూచిస్తోంది. భారీ ఆనకట్టల నిర్మాణం, మైనింగ్, పరిశ్రమల స్థాపన వంటి వాటికి అభివృద్ధి పేరిట అనుమతులిస్తున్నారు. ప్రభుత్వాలు నామమాత్రంగా ఇచ్చే పరిహారం ఏ మూలకూ చాలక, చేసేందుకు పనులేమీ లేక వలసలు తప్పటం లేదు.ఇలాంటి 'అభివృద్ధి' పర్యవసానంగా కరువు, వరదలు, ఇతరేతర ప్రకృతి వైపరీత్యాలు కాటేస్తు న్నాయి. ఆహారం, మంచినీరు సంగతలా ఉంచి కనీసం తలదాచుకోవటానికి కూడా ఏమీ మిగలక పోవటం సమస్యాత్మకం అవుతోంది. ఇలాంటివారిని స్వదేశంలోనే సంశయంతో చూస్తారు. తమ వనరులు కాజేస్తారని, జీవికకు ముప్పు తెస్తారని ఆందోళన పడతారు. పరాయి దేశాలకు పోతే చెప్పేదేముంది? మన దేశం వరకూ చూస్తే వలసల్లో దాదాపు 99 శాతం అంతర్గతమైనవేనన్నది నిపుణుల మాట. ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వలసలు అధికంగా ఉంటుండగా, వారికి ఆశ్రయమిచ్చే రాష్ట్రాల్లో ఢిల్లీ, మహారాష్ట్రలది అగ్రస్థానం. వలసపోయే వారిలో ఇతరేతర సమస్యలకు తోడు ఆరోగ్య సమస్యలు కూడా తక్కువేమీ కాదు. ఎండనక, వాననక, తిండితిప్పలు లేక గత్యంతరం లేక కాలినడకన వెళ్లేవారుంటారు. ఎగిసిపడు తున్న అలలు కలవరపరుస్తున్నా, ఏ క్షణమైనా మింగేస్తాయన్న భయాందోళనలున్నా నాటుపడవ లపై సముద్రాలను దాటాలని చూసేవారూ ఉంటున్నారు. ఇలాంటివారంతా వ్యాధుల బారినపడి ఆదరించేవారు లేక, వైద్యసాయం అందక మృత్యుముఖంలోకి పోతున్నారు. తొలుత 2008లో, ఆ తర్వాత 2017లో ఐక్యరాజ్యసమితి ఈ సమస్యపై తీర్మానాలు చేసింది. ప్రత్యేకించి వలసదారుల ఆరోగ్యావసరాలను చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సభ్యదేశాలకు సూచించింది. అయిదేళ్ల క్రితం ప్రపంచ ఆరోగ్యసంస్థ ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. కానీ ఆ సంస్థలో దీనిపై శ్రద్ధపెట్టి పనిచేసే విభాగాలు ఆర్థిక సమస్యలతో మూతబడ్డాయి. వలసదారుల్ని చూసి భయపడే సాధారణ ప్రజానీకం, దీన్ని తమకనుకూలంగా మార్చుకుని అధికారం అందుకోవాలనుకునే రాజకీయ పక్షాల నాయకులు సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో వలసదారుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన చర్యలు కూడా ఉన్నాయి. కానీ పట్టించుకునే వారేరి? సక్రమంగా ఆలోచించి వినియోగించుకుంటే వలసదారులు ఏ సమాజాభివృద్ధికైనా తోడ్పడతారు. చాలా రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే నిర్మాణరంగ, వ్యవసాయరంగ కార్మికులకు పనులు లభిస్తున్నాయి. కానీ వారి యోగక్షేమాలు పట్టక పోవటం, వారి నైపుణ్యాభివృద్ధికి అవసరమైన పథకాలు లేకపోవటం సమస్యలకు దారి తీస్తోంది.దురదృష్టవశాత్తూ హింసనుంచీ, వేధింపులనుంచీ తప్పించుకుని వస్తున్న వలసదారుల్ని అనుమాన దృక్కులతో చూసే వైఖరి పెరుగుతోంది. ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించిన మొదట్లోనే ప్రపంచ మానవ హక్కుల డిక్లరేషన్ వెలువరించింది. దానికి అనుగుణంగా 1951లో శరణార్థుల ఒడంబడిక అమల్లోకొచ్చింది. మన దేశంతోపాటు ఇండొనేసియా, క్యూబా, ఎరిత్రియా, లిబియా వంటి దేశాలు దానిపై సంతకం చేయలేదు.అలా సంతకం చేయకపోయినా శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ వంటి దేశాలనుంచి వచ్చిన శరణార్థులను భారత్ ఆదుకుంది. టిబెట్ నుంచి వచ్చిన 80,000 మంది గత కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. కానీ ఆ ఒడంబడికను గుర్తించి సంతకం చేస్తే దానికింద శరణార్థులకు కల్పించాల్సిన తప్పనిసరి సదుపాయాలు వగైరా వుంటాయి. ఇక్కడికొచ్చినవారు వాటిని కోల్పోవాల్సి వస్తోంది.ఎంతో సంపన్నవంతమైన అమెరికాయే వలసలను అడ్డుకోవటానికి వేలాది మందిని జైళ్లపాలు చేస్తోంది. వెనక్కి పంపుతోంది. చాలా యూరప్ దేశాలు ఆ మార్గాన్నే అనుసరిస్తున్నాయి. ఇక అంతంత మాత్రం ఆర్థిక వ్యవస్థలతో సతమతమయ్యే దేశాల్లో శరణార్థులను, వలసదారులను ఆదరిస్తారని ఆశించటం దురాశే.ఎవరెంత వ్యతిరేకిస్తున్నా, ద్వేషిస్తున్నా వలసలు మున్ముందు మరింత పెరుగుతాయని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. ఎందుకంటే వారు తమ ఇష్టానుసారం రావటం లేదు. తప్పనిసరై, గత్యంతరం లేక స్వస్థలాలను వదలవలసి వస్తోంది. వలసలను వ్యతిరేకించటం కాక, వాటిని అనుకూలంగా మలుచుకోవటం ఎలాగో నేర్చుకోవటం అన్ని దేశాలకూ తప్పనిసరి.

# దుమారం రేపుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలు..!



అనంతపురం:అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తాజా వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.. మొదటినుంచి వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేతలు పేర్ని నాని, దేవినేని అవినాష్ వంటి వారు తరచూ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమను అక్రమ కేసులు, అరెస్టులతో వేధిస్తోందని విమర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. తాము అధికారంలోకి వచ్చాక టీడీపీ శ్రేణుల అంతు చూస్తామని, ఇప్పటినుంచే జైళ్లు రిపేరు చేయించకోవాలని వైసీపీ నేతలు పేర్కొనడంపై ఆయన మండిపడ్డారు. చంద్రబాబుది చేతగానితనం కాదని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన వైసీపీ నేతల విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నా రన్నారు. మీకు నాలుగేళ్ల సమయం కావాలేమో.. మేము ఇప్పుడే ఉతికితే ఏం చేస్తారని ప్రశ్నించారు. వైసీపీ నేతలు ఇలాగే మాట్లాడితే చితక్కొట్టాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ కార్యకర్తల వైపు కాకుండా.. వైసీపీ వైపే చంద్రబాబు ఉన్నారన్నారు. కాబట్టే వారు చెలరేగిపోతున్నారన్నారు. వారు ఇలాగే మాట్లాడితే చితగ్గొట్టాలన్నారు. లైన్ దాటి బహిరంగంగా ఆయన అలా పిలుపునివ్వడం, బూతు పదజాలంతో విరుచుకుపడడం, తమ అధినేతకు సైతం పరోక్షంగా చురకలంటించడం వివాదాస్పదంగా మారాయి.

# ఢిల్లీ టూర్లపై బీఆర్ఎస్ కు రేవంత్ దిమ్మతిరిగే రిప్లై!

హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తరచూ ఢిల్లీ వెళుతున్న వైనంపై విపక్షాలు.. ప్రత్యేకించి బీఆర్ఎస్ ఘాటు వ్యాఖ్యలతో విరుచుకుపడుతోంది. ఇప్పటికే ఈ విమర్శలపై పలుమార్లు తనదైన శైలి సమాధానం ఇచ్చిన రేవంత్ తాజాగా బుధవారం నాటి అఖిలపక్ష సమావేశం లోనూ ఈ విషయాన్ని ప్రస్తావించారు. తన ఢిల్లీ టూర్లపై విమర్శలు గుప్పిస్తున్న బీఆర్ఎస్ కు ఆయన దిమ్మితిరిగే రితిలో అదిరిపోయే సమాధానం ఇచ్చారు. ఆయా ప్రాజెక్టులకు అనుమతులు కేంద్రం కాకుంటే%ా% ఎర్రవలి ఫామ్ హౌస్ లో కూర్చున్న మీరు ఇస్తారా? అంటూ ఆయన సెటైర్లు సంధించారు. తెలంగాణ ఆవిర్భవించాక పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్%ా% ధనిక రాష్ట్రాన్ని కాస్తా అప్పుల రాష్ట్రంగా మార్చారని రేవంత్ ఆరోపించారు. అంతేకాకుండా కేసీఆర్ చేసిన అప్పులన్నీ 11 శాతానికి చేసినవేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ శాఖ అనుమతులు లేక రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో చిన్నచిన్న రోడ్లు కూడా ఎక్కడికక్కడ ఆగిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రీజనల్ రింగ్ రోడ్డుకు అనుమతులు కావాలంటే ఎక్కడికెళ్లాలని ఆయన ప్రశ్నించారు. మెట్రో మలి దశ పనులకు నిధులు, అనుమతుల కోసం ఎక్కడికి వెళ్లాలని రేవంత్ బీఆర్ఎస్ నేతలను నిలదీశారు. బీఆర్ఎస్ చేసిన అప్పుల వడ్డీలను 7 శాతానికి తగ్గించుకునే యత్నం చేస్తున్నామన్న రేవంత్.,..అందులో భాగంగానే



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కలుస్తున్నామన్నారు. ఇక నిలిచిన రోడ్లను పూర్తి చేసేందుకు అటవీ అనుమతుల కోసం సంబంధింత శాఖ మంత్రిని కలుస్తున్నామన్నారు. రీజనల్ రింగ్ రోడ్డుకు అనుమతులు, నిధుల విషయంలో ఉపరితల రవాణా శాఖ మంత్రిని కలవకుండానే పనులు అవుతాయా? అని ఆయన ప్రశ్నించారు. ఇక మెట్రో విస్తరణకు డిల్లీలో ప్రదానిని కలవకుంటే అనుమతులు వస్తాయా? అని రేవంత్ ఫైరయ్యారు.

# వారికి వాయిస్ లేకుండా పోయింది!

అమరావతి,నాయకుడు అన్నాక.. మీడియాతో అనుబంధం ఉంటుంది. నాయకులకు-మీడియాకు మధ్య అవినాభావ సంబంధం కూడా పెరిగిపోయింది. ఎంత సేపూ.. మీడియా ముందు ఉండాలనే నాయకులు కోరుకుంటారు. అవసరం వస్తే.. అదే పనిగా మీడియా ముందు కూర్చునే నాయకులు కూడా.. ఏపీలో బాగానే ఉన్నారు. మీడియా ముందు సంచలన వ్యాఖ్యలు చేయడంతోపాటు.. సంచలనాలు సృష్టించాలని బావించే వారు కూడా ఉన్నారు. అయితే.. ఇప్పుడు వీరికి పనిలేకుండా పోయింది. ముఖ్యంగా టీడీపీలో నాయకులు ఫైర్ బ్రాండ్లుగా ముద్ర వేసుకున్న వారు కూడా ఉన్నారు. ఉదాహరణకు చింతమనేని ప్రభాకర్, యరపతినేని శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి, గంటా శ్రీనివాసరావు వంటి వారు ఏం మాట్లాడినా .. సంచలనాలు సృష్టిస్తాయి. వారికి ఉన్న ఇమేజ్ అలాంటింది. దీంతో గతంలో వారు తరచుగా మీడియా ముందుకు వచ్చేవారు. ఏదో ఒక విషయంపై వారు ప్రస్తావన చేసేవారు. కానీ, గత ఏడాది కాలంలో వీరు పెద్దగా మీడియా ముందుకు వచ్చిన దాఖలా లేకుండా పోయింది. ఈ విషయంలో పార్టీ అధిష్టానం నుంచి బలమైన సంకేతాలు వచ్చాయన్న వాదన వినిపిస్తోంది. ఏది ఉన్నా.. ముందుగా తమకు చెప్పి.. ఆ తర్వాతే.. మీడియా ముందుకు రావాలని పార్టీ నిర్ణయం తీసుకుంది. దీంతో



చాలా మంది ఫైర్ బ్రాండ్లు రావడమే మానేశారు. మరో కీలక విషయం ఏంటంటే.. పార్టీ నిర్దేశించిన అంశాలపై మాత్రమే మాట్లాడాలని తేల్చి చెప్పారు. దీంతో ఆ నిర్దేశిత అంశాలపైనే మాట్లాడుతున్నారు. దీంతో వారు సరైన రీతిలో ప్రాజెక్టు కాలేక పోతున్నారన్న వాదన వినిపిస్తుండడం గమనార్హం.

# ఆధ్యాత్మిక మార్గాన్ని వదిలేసి.. రాజకీయాల్లోకి!



పాట్నా:ఏ ప్రాంతీయ పార్టీలోనైనా వారసులదే హవా. అందులోనూ కొడుకులకే ప్రాధాన్యం. వారికే అగ్రతాంబూలం. ప్రాంతీయ పార్టీని స్థాపించిన నాయకుడు ఎలాగూ ముఖ్యమంత్రి అవుతాడు. ఆయన తరువాత కొడుకే పగ్గాలు తీసుకుంటాడు. ఏ రాష్ట్రంలోనైనా ఇదే పరిస్థితి ఉంది కదా. తెలంగాణలో కేసీఆర్? తరువాత కేటీఆర్?కు అవకాశం ఉందంటున్నారు. ఏపీలో చంద్రబాబు తరువాత లోకేష్?కు అవకాశం ఉందంటున్నారు. ఆల్రెడీ కేటీఆర్? రెండుసార్లు మంత్రిగా పనిచేశాడు. లోకేష్? మంత్రిగా పనిచేస్తున్నాడు. తమిళనాడులో కరుణానిధి తరువాత ఆయన కుమారుడు స్టాలిన్? సీఎం అయ్యాడు. ఒడిశాలో బిజూ పట్నాయక్? కుమారుడు నవీన్? పట్నాయక్? సీఎం అయ్యాడు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉంది. ఇప్పుడు బిహార్?లో సీఎం నితీష్?కుమార్? కుమారుడు రాజకీయ అరంగేట్రం చేస్తాడనే టాక్? బలంగా వినిపిస్తోంది. ఆయన రాజకీయాల్లోకి రావాలని జేడీయూ నాయకులు కూడా డిమాండ్? చేస్తున్నారు. నితీష్ కుమార్ తన కుమారుడు నిశాంత్ కుమార్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. గత ఏడాదే ఈ ప్రచారం మొదలైంది. ఈ ఏడాది బిహార్? ఎన్నికలు జరగబోతున్నాయి కాబట్టి ఇప్పుడీ ప్రచారం, ఊహాగానాలు ఎక్కువయ్యాయి. ఇటీవలి కాలంలో తండ్రితో కలిసి నిశాంత్ కుమార్ బహిరంగ వేదికలపై దర్శనమిస్తున్న నేపథ్యంలో ఆయన రాజకీయాల్లోకి రావడం ఖాయంగానే కనిపిస్తోంది. నిశాంత్‌ను రానున్న ఎన్నికల్లో పోటీకి నిలపాలని పార్టీ ఎమ్మెల్యే వినయ్ చౌదరి ఇటీవల డిమాండ్ చేశారు. మరో మంత్రి జామా ఖాన్ దీనిని బలపరుస్తూ వ్యాఖ్యలు చేశారు. నిశాంత్‌కు మంచి రాజకీయ అవగాహన ఉందని, ఆయన యువతకు స్ఫూర్తిని ఇవ్వగలరని అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లోనే పోటీ చేయించేలా త్వరలో జరిగే శాసనసభా పక్ష భేటీల్లో ఈ విషయం ప్రస్తావిస్తామని ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రకటనలు చేస్తున్నారు. మొన్నటి వరకు రాజకీయాలకు దూరంగా ఉన్న నిశాంత్, గడిచిన ఆరు నెలలుగా తండ్రితో కలిసి పార్టీ వేదికలపై కనిపిస్తున్నాడు. బీహార్ సీఎం నితీష్ కుమార్, ఆయన దివంగత భార్య మంజు సింగ్‌ల ఏకైక కుమారుడు నిశాంత్ కుమార్. ఆయన వయసు 38 ఏళ్లు. ప్రస్తుతం ఆయన ఇప్పటి వరకు రాజకీయాలు, టీవీ డిబేట్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ వస్తున్నాడు. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజినీరింగ్ చదివాడు. నిశాంత్ నలంద జిల్లాలోని హర్నాట్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలంటూ ఆ పార్టీ నేతల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. హర్నాట్ స్థానంలో జేడీయూకు బలమైన పట్టుంది. గత 20 ఏళ్లుగా అక్కడ ఆ పార్టీ నేతలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వాస్తవానికి, నితీశ్ తన ఎన్నికల ప్రయాణాన్ని ఈ స్థానం నుండే ప్రారంభించారు. ప్రస్తుతం జేడీయూకే చెందిన హరినారాయణ్ సింగ్ ఆ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. వరుసగా మూడుసార్లు ఈ స్థానాన్ని గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలోనే హర్నాట్ స్థానం నుంచి పోటీపై చర్చ జరుగుతోంది. నిశాంత్ కుమార్ చివరిసారిగా 2015లో తన తండ్రి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నాడు. అప్పట్లో ఆయన తనకు రాజకీయాల్లోకి వచ్చే యోచన లేదని స్పష్టం చేశాడు. తనకు రాజకీయాలపై ఆసక్తి లేదని, ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలని అనుకుంటున్నట్లు మీడియాకు చెప్పాడు. కాని ఇప్పుడు ఆధ్యాత్మిక మార్గంలో కాకుండా రాజకీయ మార్గంలో ప్రయాణించాలని అనుకుంటున్నట్లుగా ఉంది. ఒకప్పుడు బిహార్‌లో కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు జేడీయూ అధినేత నితీష్?కుమార్?. కాని ఆయనే ఇప్పుడు తన కుమారుడిని రాజకీయాల్లోకి తెచ్చి తన తరువాత అతనికి పగ్గాలు అప్పగించాలని ప్లాన్? చేస్తున్నారా?

# నియోజకవర్గాల పునర్విభజనకు లైన్‌క్లియర్




న్యూఢిల్లీ, దేశంలో జన గణన చేపట్టడానికి అనుమతిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ సోమవారం జారీ అయ్యింది. వచ్చే ఏడాది నాటికి జన గణన, కులగణన పూర్తి కానుంది. కొత్త జనాభా లెక్కల ఆధారంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాలు.. శాసనసభ స్థానాల పునర్విభజన ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టనుంది. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో శాసనసభ స్థానాలను పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టనున్నట్లు సమాచారం.

రాష్ట్ర విభజన జరిగిన 11 ఏళ్ల తర్వాత

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర విభజన జరిగిన 11 ఏళ్ల తర్వాత రెండు రాష్ట్రాల శాసన సభల్లో స్థానాల పెంపునకు లైన్ క్లియర్ కావడం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజిస్తూ 2014, మార్చి 1న ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014ను కేంద్రం జారీ చేసింది. దీంతో 2014, జూన్ 2న తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించింది. రాజ్యాంగంలోని 170వ అధికరణలోని సెక్షన్-15 ప్రకారం శాసనసభ స్థానాలను ఆంధ్రప్రదేశ్‌లో 175 నుంచి 225కు, తెలంగాణలో 119 నుంచి 134కు పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని విభజన చట్టం-2014లో సెక్షన్-26(1) ద్వారా ఎన్నికల సంఘానికి కేంద్రం నిర్దేశించింది. విభజన చట్టం ప్రకారం 2019 నాటికే రెండు రాష్ట్రాల్లో శాసనసభ స్థానాలను పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ఎన్నికల సంఘం, కేంద్రం పూర్తి చేస్తాయని రాజకీయపార్టీలు ఆశిస్తూ వచ్చాయి. కానీ.. ఆ ఆశలు అడియాసలయ్యాయి.

జన గణనతో ముడిపెట్టిన కేంద్రం

జమ్మూ కశ్మీర్‌లో శాసనసభ స్థానాల పునర్విభజనకు 2022, మే 5న కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనూ శాసనసభ స్థానాలను పెంచేలా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టులో కె.పురుషోత్తం రెడ్డి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో శాసనసభ స్థానాలను పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడంపై కేంద్రం అభిప్రాయాన్ని సుప్రీం కోర్టు కోరింది. దేశంలో జన గణన ప్రక్రియ 2026లో పూర్తవుతుందని.. ఆ తర్వాతే విభజన చట్టంలో సెక్షన్-26(1) ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో శాసనసభ స్థానాల పెంపునకు నియోజకవర్గాల పునర్విభజన చేపడతామని స్పష్టం చేస్తూ అడిషనల్ సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ సుప్రీంకోర్టుకు స్పష్టం చేశారు. ఈ పిటిషన్‌పై తీర్పును ఏప్రిల్ 30న సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం రిజర్వు చేసింది.

ప్రజల సౌకర్యం.. పాలన సౌలభ్యమే ప్రాతిపదికగా:

జన గణన ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న అంశం ఏపీ విభజన చట్టంలో ఎక్కడా లేదు. ప్రజల సౌకర్యం, పాలన సౌలభ్యం, భౌగోళికంగా సమస్యలు తలెత్తకుండా శాసనసభ స్థానాలను పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని మాత్రమే ఎన్నికల సంఘానికి విభజన చట్టం నిర్దేశించింది. కానీ.. కేంద్రం జన గణనతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో శాసనసభ స్థానాల పునర్విభజనను ముడిపెట్టడం గమనార్హం. వాస్తవానికి జన గణన 2020లో ప్రారంభమై 2021 నాటికి పూర్తి కావాలి. కానీ.. 2020 ఫిబ్రవరి నుంచి 2022 వరకూ కరోనా మహమ్మారి మూడు విడతలుగా దేశ వ్యాప్తంగా ప్రబలింది. దీంతో జన గణనను అప్పట్లో కేంద్రం వాయిదా వేసింది. అంతలోనే 2024 సార్వత్రిక ఎన్నికలు ముంచుకు రావడంతో ఆ అంశం మరుగున పడింది.

### బనకచర్లతో వచ్చే నష్టమేమిటో

హైదరాబాద్,బనకచర్లతో తెలంగాణకు జరిగే అన్యాయమేంటో చెప్పమంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దగ్గర సమాధానం లేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. డైవర్షన్ రాజకీయాల కోసం ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమం పెట్టారని విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'భాజపా భరోసా కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాలను స్వీకరించాం. అనేక మంది దివ్యాంగులు వచ్చి తమ సమస్యలు తెలిపారు. వారికి ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. ప్రతి ఫ్లలెలో కాంగ్రెస్ ఇమేజ్ భూస్థాపితం అయింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సగం కాంగ్రెస్.. సగం భారాస. కేసీఆర్ డైరెక్షన్‌లో తెలంగాణ

# ఇజ్రాయెల్-స్ట్రైకర్.. ఇరాన్ ఫతా ఎంత డేంజరో తెలుసా?

టెహ్రాన్:పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ.. ఇజ్రాయెల్ ప్రజల పట్ల కనికరం చూపించే ప్రసక్తే లేదని ఇరాన్ సుప్రీం అయతొల్లా అలీ ఖమేనీ ప్రకటించారు. ఈ క్రమంలోనే శక్తివంతమైన హైపర్‌సోనిక్ మిస్సైల్స్‌ను ప్రయోగించినట్లు ప్రకటించారాయన. మరోవైపు.. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కూడా 'ఫతా-1 మిస్సైల్స్'ను ప్రయోగాన్ని ధృవీకరించింది. ఈ నేపథ్యంలో ఈ క్షిపణి అంత శక్తివంతమైందా? దాని సామర్థ్యం ఏపాటిదో ఓ లుక్కేద్దాం. ఫతా హైపర్‌సోనిక్ మిస్సైల్.. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసుకున్నట్లు ఇరాన్ ప్రకటించుకుంది. అయితే ఈ విషయంలో పలు అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే హైపర్‌సోనిక్ క్షిపణి సాంకేతికతను అభివృద్ధి చేయడం చాలా క్లిష్టమైన పని. ఇరాన్ గతంలో రష్యా, చైనా వంటి దేశాలతో రక్షణ రంగంలో పరస్పర సహకారం కొనసాగించింది. బహుశా ఈ దేశాల భాగస్వామ్యంతోనే ఫతాను రూపొందించి ఉండొచ్చని పలువురు విశ్లేషకులు భావిస్తుంటారు. అయితే.. ఈ క్షిపణి అభివృద్ధితో అమెరికా, రష్యా, చైనా తర్వాత హైపర్‌సోనిక్ క్షిపణి కలిగిన నాలుగో దేశంగా ఇరాన్ నిలిచింది. అలాగని ఇజ్రాయెల్ మీదకు ఫతా హైపర్‌సోనిక్ మిస్సైల్స్‌ను ఇరాన్ ప్రయోగించడం ఇప్పుడే తొలిసారేం కాదు!. కిందటి ఏడాది అక్టోబర్ 1వ తేదీన జరూసలేం మీదకు ఈ క్షిపణలను ప్రయోగించినట్లు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఇటు ఇరాన్, అటు ఇజ్రాయెల్ ఈ ప్రచారంపై ఇప్పటిదాకా మౌనం వీడలేదు. అయితే తాజాగా మాత్రం ఇరాన్ అధికారిక ప్రకటనతో వీటి ప్రయోగం జరిగిందన్న విషయం వెలుగు చూసింది. హైపర్‌సోనిక్ అనే పదాన్ని సాధారణంగా అత్యంత వేగమైన రవాణా వ్యవస్థకు ఉపయోగిస్తుంటారు. ఆ తర్వాతి కాలంలో అది యుద్ధ రంగానికి అన్వయించడం మొదలుపెట్టారు. హైపర్ సోనిక్ మిస్సైల్స్ అంటే.. అత్యాధునికమైన క్షిపణులు అని అర్థం. ఇవి శబ్ద వేగం కంటే అధిక రెట్లతో ప్రయాణిస్తాయి. అత్యంత వేగంతో ప్రయాణించడం వల్ల శత్రుదేశాలు గుర్తించడంగానీ, మార్గంమధ్యలోనే నాశనం చేయడంగానీ చాలా కష్టం. ఫతాను 2003లో ఇరాన్ ఆవిష్కరించింది. దీనికి ఆ పేరు పెట్టింది ఇరాన్ సుప్రీం




ఖమేనీనే. దీని పొడవు 12 మీటర్లు. 1,400 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఇది ఛేధించగలదు. సుమారు 200 కేజీల పేలుడు పదార్థాలను మోసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉంది. శబ్ద వేగం కంటే 13 నుంచి 15 రెట్లు అధికంగా ఇది ప్రయాణించగలదు. అంటే దాదాపు గంటకు 16,000-18,500 కిలోమీటర్లు వేగం ఉంటుందన్నమాట. ఇది హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికిల్ హైపర్‌సోనిక్ క్రూజ్ మిసైల్ లక్షణాలను కలిగి ఉంది. కానీ, ఫతా సామర్థ్యానికి సంబంధించిన సరైన వివరాలను ఇరాన్ ఇప్పటిదాకా వెల్లడించకపోవడం గమనార్హం. కాకుంటే.. ఐరన్ డోమ్, ఆరో లాంటి అత్యాధునిక రక్షణ వ్యవస్థలు ఉన్న ఇజ్రాయెల్‌కు సైతం ఈ క్షిపణి అంతు చిక్కదు. అందుకే ఇరాన్ దీనిని ముద్దుగా ఇజ్రాయెల్-స్ట్రైకర్ అని అభివర్ణిస్తుంటుంది. ఇజ్రాయెల్ మాత్రమే కాదు.. హిందూమహాసముద్రంలో సంచరించే అమెరికా యుద్ధ నౌకలను కూడా ఇది ఆనాశనం చేయగలదని ఇరాన్ తరచూ ధీమాగా చెబుతుంటుంది. తాజా పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో.. ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతాల గగన తలాలను పూర్తిగా ఇరాన్ తమ స్వాధీనంలోకి తెచ్చుకోగలిగిందంటే మాత్రం.. అందుకు ఫతాలాంటి హైపర్‌సోనిక్ మిస్సైల్ కారణం.

# చెవిరెడ్డికి ప్రత్యేక సౌకర్యాలు..ఎందుకంటే?

అమరావతి,మద్యం కేసులో అరెస్టు అయిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి జైలులో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. లిక్కర్ స్కాం డబ్బును ఎన్నికల్లో ఖర్చు చేశారని, దాదాపు రూ.250 కోట్లు చేతులు మారడంలో చెవిరెడ్డి పాత్ర ఉందంటూ ఆయనను సిట్ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. చెవిరెడ్డితోపాటు ఆయనకు అత్యంత సన్నిహితుడైన వెంకటేశ్ నాయుడుని రెండు రోజుల క్రితం బెంగళూరులో అరెస్టు చేశారు. బుధవారం ఉదయం విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా, ఇద్దరికి జులైన 1 వరకు కోర్టు రిమాండ్ విధించింది. మద్యం కేసులో చెవిరెడ్డి, వెంకటేశ్ నాయుడును అరెస్టు చేసిన పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. బెంగళూరు నుంచి విజయవాడకు తీసుకువచ్చి, కోర్టులో హాజరుపరిచేందుకు ముందు సుమారు మూడు గంటల పాటు ఇద్దరినీ సిట్ అధికారులు విచారించారు. అయితే ఈ విచారణకు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఎంతమాత్రం సహకరించలేదని సిట్ అధికారులు చెబుతున్నారు. చదువుకుని సంతకం చేయమని ఇచ్చిన డాక్యుమెంట్ ను కూడా చెవిరెడ్డి చించివేశారని అంటున్నారు. మద్యం కేసులో విచారణకు తాను సహరిస్తానని చెప్పినా అరెస్టు చేశారని పోలీసులపై న్యాయాధికారికి చెవిరెడ్డి ఫిర్యాదు చేశారు. విచారణ



సమయంలో తాను చెప్పిన సమాచారం కాకుండా, వారికి ఇష్టం వచ్చినట్లు రాసుకున్నారని ఫిర్యాదు చేశారు. తనకు అనారోగ్యం ఉందని విడిచి పెట్టాలని కోరారు. అయితే చెవిరెడ్డి అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. కానీ, ఆయన అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రిమాండులో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని సూచించింది. వెన్ను నొప్పితో బాధపడుతున్న చెవిరెడ్డికి జైలులో మంచం, దిండు, దుప్పటి సమకూర్చాలని ఆదేశించింది.

# హనీమూన్ మర్డర్ కేసులో మరో బిట్ ట్విస్ట్

షిల్లాంగ్, హనీమూన్ మర్డర్ కేసులో మరో బిట్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఇప్పటి వరకు ఈ కేసులో లేని కొత్త పేరు తెరపైకి వచ్చింది. ఇటీవల మేఘాలయలో జరిగిన రాజా రఘువంశీ హత్య దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. భార్య సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహా ప్లాన్ చేసి, హత్య కోసం కిరాయి హంతకులను నియమించుకున్నారు. మేఘాలయ హనీమూన్‌కి వెళ్లిన సమయంలో భార్య సోనమ్ దగ్గర ఉండీ తన భర్త రాజాను హత్య చేయించింది. ఈ కేసుకు సంబంధించి పోలీసు దర్యాప్తులో సోనమ్ కాల్ డేటాను విశ్లేషించగా మరో పేరు బయటకు వచ్చింది. సంజయ్ వర్మ అనే వ్యక్తికి సోనమ్ మార్చి 1 నుంచి మార్చి 25 వరకు 119 కాల్స్ చేసినట్లు గుర్తించారు. ప్రస్తుతం, అతడి మొబైల్ నెంబర్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. ఇద్దరి మధ్య జరిగిన ఈ ఫోన్ సంభాషణలపై ఇప్పుడు పోలీసులు దృష్టిసారించారు. మే 23న మేఘాలయాలోని తూర్పు ఖాసీ హిల్స్‌లో రాజాను హత్య చేశారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**